(కథ)

# "పౌర్ణమి"

— గూడ శారద

సాయంకాలం 6 గం॥ అవుతుంది. బట్టలు, గాజులు వగైరా తెచ్చుకోవడానికి ఉదయం అనగా 10 గం॥లకు బయలుదేరారు రాధ, జయ ఉదయం నుండి బజారంతా తిరిగి అలసి పోయారు కాబోలు. మాట్లాడటానికి ఓపిక లేనట్టుగా ఉన్నారు. ఇద్దరికీమధ్య మౌనమే రాజ్యం ఏలుతోంది కొన్నిరోజుల క్రితం — జయ ఎవరో! ...... రాధ... ఎవరో! ఒకరి కొకరు తెలియకుండానే హఠాత్తుగా కలుసుకున్నారు. ఇద్దరిది యించుమించు ఒకే యీడు కాబట్టి చూసిన వాళ్ళందరూ అక్కచెల్లెళ్ళనే అనుకుంటారు వాస్తవానికికూడా వాళ్ళిద్దరు అక్కచెల్లెళ్ళ కన్న మిన్నగా కలిసి ఉంటారు

రాధ!... ఈ సామానులన్నీ ఇంటికి తీసుకెళ్ళు... నేను ఇపుడే అర నిముషంలో వచ్చేసాను — సామాన్ల బుట్ట రాధ చేతికందిస్తూ అంది జయ

అం రాధ ఒక్కదానివి వెళ్ళగలవా?... భయపడకేం!

అదిగో ఇల్లు దగ్గర్లోనే ఉందికదే ...నాకేం భయం లేదులే ఏమోనే ఈ అందాల అపరంజి బొమ్మను ఎవరైనా ఎత్తుకు పోతారేమోనని భయమేస్తుంది... అంది కొంటెగా రాధ బుగ్గ చిటిక వేస్తూ అంది జయ మళ్ళీ జయ ఎక్కడికి వెళ్తున్నదో రాధఅడగనూ లేదు, జయ కూడ చెప్పలేదు.

సరే నువ్వెళ్ళు నేను ఇప్పుడే వస్తాను అంటూ గబగబ వెళ్ళింది జయ జయ వెళ్ళినవైపు చూస్తూ చిన్నగా నవ్వుకుంది రాధ.

నిజంగా జయది వెన్న లాంటి హృదయం. ఎప్పుడూ గలగలనవ్వుతూ పడిచే వాళ్ళను నవ్వించడానికి ప్రయత్నిస్తుంది పూర్వ జన్మలో ఏం పుణ్యము చేసుకుందో ఏమో గాని... గుండెల్లో బడబాగ్ని దాచుకొనియైనా స్వేచ్ఛగా చిరునవ్వు చిందించ గలుగుతుంది. అలా నవ్వడం అందరివల్ల కాదేమో. ఆ రోజు జయ వాళ్ళ అన్నయ్య తనను ఆదుకొని చేరదియక పోతే తను యిలా నలుగురిలో మనిషిగా తిరుగ కల్గేదా?

రాధ ఊహ తెలియనప్పుడే తల్లిదండ్రులను పోగొట్టుకున్న అభాగ్యురాలు తల్లి తండ్రి లేరన్న లోటు తెలియకుండా చెల్లి రాధను మల్లె మొగ్గకన్న సుకుమారంగా ముట్టుకుంటే కందిపోతుందే అన్నట్లు పెంచాడు రాధ అన్నయ్య గోపి

ఆడిందే ఆటగా పాడిందే పాటగా అన్నయ్య లాలనలో కష్టాలంటే ఏమిటో తెలియని రాధ... జీవితం అంటే అందమైన పూలబాటనే కాని... ముళ్ళబాట కూడ ఉంటుందని తెలియని అమాయకురాలు.

ఇంటర్ చదువుతున్న రాధను కాలేజీ వరకు దిగబెట్టి ఆఫీసుకు వెళ్ళేవాడు గోపి గోపి కన్నా ముందుగా వచ్చేది రాధ. కాలేజీ నుండి రాగానే ఇంట్లో వంట వగయిరా పనులన్ని గబగబ చేసి అన్నయ్య కోసం నిరీక్షిస్తూ గుమ్మములో నిలబడేది. గోపిని ఒక్క క్షణం కూడ చూడకుండా ఉండలేదు రాధ.

ఏ కారణం వల్లనైనా కాస్త ఆలస్యం అయినా రాధ హృదయం అన్నయ్యను చూడక ఎన్నో యుగాలయినట్లు గోపి రాగానే అన్నయ్యా... అన్నయ్యా... అంటూ పిచ్చిలోనే అన్నను చుట్టేసేది. చిన్నారి చెల్లికి ఏం జరిగిందో ననుకొని గాబరాగా ఏమైందమ్మా? రాధ... అంటూ కంగారు పడి పోయేవాడు గోపి. అబ్బే ఏం లేదన్నయ్యా... నువ్వేమో ఇంకా రాలేదని భయం వేసిందంటూ బావురుమనేది,

ఛ... అదేమిటమ్మా రాధ... మరీ చిన్నపిల్లా అలా కంగారు పడితే ఎలా!...... మా బంగారు తల్లివి కదూ! ఇంకెప్పుడు ఆలస్యంగా రానుగా అంటూ బుజ్జగించే వాడు